

ఆర్‌ఎంసి అదనపు కమిషనర్‌గా రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం : ఆర్‌ఎంసి అదనపు కమిషనర్‌గా వి.వి.రామలింగేశ్వర్ బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాద పూర్వకంగా కలిశారు. మొక్కను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు అభినందనలు తెలిపారు. 2027 గోదావరి పుష్కరాలను పురస్కరించుకొని ఇక్కడ నిర్వహించే బాధ్యతలు ఎంతో కీలకమన్నారు.. అదే విధంగా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలులో తనదైన పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. రామలింగేశ్వర్ అనంతపురం నుంచి బదిలీపై రాజమహేంద్రవరం వచ్చారు.



పరీక్షల వేళ ఫీజుల ఒత్తిడి

- ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ఇష్టారాజ్యం
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పరీక్షల సమయంలో విద్యార్థులపై ఫీజుల ఒత్తిడి ఎక్కువైంది. ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 'ఫీజులుం' మళ్లీ మొదలైంది. విద్యాసంవత్సరం పూర్తికాకముందే ఇప్పటికే అడ్మిషన్ల వేట మొదలైన విషయం విధితమే. మరోవైపు వార్షిక పరీక్షల గడువు సమీపిస్తుండటంతో బకాయి ఫీజుల వసూళ్లకు యాజమాన్యాలు తెరలేపాయి. కార్పొరేట్ రెసిడెన్షియల్ ఇంటర్మీడియెట్ కాలేజీ యాజమాన్యాలకు పోటీగా ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. అదే విధంగా వారికి పాఠ్యాంశాల బోధన చేపడుతూనే, ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయి. జిల్లాలో ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ విద్యా సంవత్సర పరీక్షలకు సుమారు 80 వేల మంది విద్యార్థులు హాజరవుతున్నారు. తాజాగా హాల్ టికెట్ల మంజూరు నేపథ్యంలో విద్యా సంవత్సర అకడమిక్ బకాయిలు, స్కూలు, కాలేజీల బస్సు రవాణా ఛార్జీలను తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి వసూళ్లు చేస్తున్నారు. ప్రతి రోజూ ఫోన్లకు మెసేజ్‌లు పంపించడంతో పాటు కొన్ని సార్లు ఫోన్లు చేసి బకాయిలు చెల్లించాలని కోరుతున్నారు. లేని పక్షంలో పరీక్షలకు అనుమతించడంలో ఇబ్బందులు తప్పవంటూ హుకుం జారీ చేయడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అదేమంటే ఇష్టం లేకపోతే టీసీ తీసుకుని వెళ్లిపోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నాయి. ఈ అంశంపై ఎవరైనా తల్లిదండ్రులు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ ఏ ఒక్క యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రస్తుతం ప్రాక్టికల్స్ నడుస్తున్నాయి. అకాడమిక్ ఇయర్ ఇంకా పూర్తి కాలేదు. కానీ జిల్లా కేంద్రమైన రాజమండ్రి కేంద్రంగా పలు కార్పొరేట్ ఇంటర్మీడియెట్ యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. దీంతో విద్యార్థులు పూర్తిస్థాయిలో పరీక్షలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారు. ఇంటర్మీడియెట్ ఫైనల్ పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. దీంతో ఫీజులు చెల్లించాల్సిందేనంటూ యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. దీంతో విద్యార్థులు పూర్తిస్థాయిలో పరీక్షలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారు.

ఇదిలా ఉండగా కొన్ని ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు మరో అడుగు ముందుకేశాయి. తొమ్మిదో తరగతి పూర్తి చేసుకుని వచ్చే అకాడమిక్ ఇయర్‌లో పదో తరగతిలో అడుగుపెట్టబోయే విద్యార్థుల నుంచి ముందుగానే ఫీజులు ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. తొమ్మిది, పదో తరగతిలో కామన్‌గా ఉండే పలు పాఠ్యాంశాలను ముందే పలు ప్రైవేటు యాజమాన్యాలు ప్రారంభించాయి. పదో తరగతి ఫీజు చెల్లించని వారికి ... ముందస్తుగా పేరు నమోదు చేసుకుని రూ.10 వేలు అడ్వాన్సుగా చెల్లించిన వారికి మొత్తం ఫీజులో కొంత రాయితీ కల్పిస్తున్నారు. ఆయా కాలేజీల్లో పని చేస్తున్న అధ్యాపకులకు అడ్మిషన్ల టార్గెట్లు ఇచ్చాయి. ఒకొక్క అద్యాపకునికి 100కిపైగా అడ్మిషన్లు లక్ష్యం వచ్చినట్లు తెలుస్తోంది. అకాడమిక్ ఇయర్ ప్రారంభం సమయంలోనే 60 శాతం ఫీజులు తీసుకుంటున్నాయి. మిగిలిన మొత్తాన్ని దసరా దీపావళిలోపే వసూలు చేస్తున్నాయి. విధిలేని పరిస్థితులలో తల్లిదండ్రులు అప్పు చేసి ఫీజులు చెల్లించాల్సి వస్తోంది.

ఫీజు మొత్తం చెల్లించమంటున్నారు

మా అబ్బాయిని ఓ ప్రయివేటు కాలేజీలో ఇంటర్ ఎంపిసిలో చేర్పించాం. ఒక ఒక టర్మ్ ఫీజు రూ.12వేలు చెల్లించాల్సి ఉంది. ఇంకా సమయం ఉన్నా సరే కళాశాల యాజమాన్యం నుంచి ఫోన్లు చేస్తున్నారు. వెంటనే చెల్లించాలని, లేకుంటే హాల్‌టిక్కెట్ ఇవ్వబోమంటూ ఫోన్లు చేస్తున్నారు.

- యు.సూర్యావతి, రాజమహేంద్రవరం,



రాఘవులను గెలిపించాలని ఓట్లు అభ్యర్థిస్తున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి

రాఘవులును గెలిపించాలి

పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు ప్రచారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రశ్నించి పోరాడే సత్తా ఉన్న డివి రాఘవులును గెలిపించాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలోని గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్, ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాల, కందుకూరి మహిళా కళాశాల, పలు ప్రభుత్వ కార్యాలయాలను ఆయన సందర్శించారు. పిడిఎఫ్ అభ్యర్థి రాఘవులుకు ఓటేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ గత ప్రభుత్వం మొండిగా ఉన్నప్పటికీ అనేక పోరాటాలు చేసి సమస్యలను పరిష్కరించు కోగలిగామన్నారు. సమస్యలపై ప్రశ్నించి పోరాడే స్వభావం ఉన్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించు కోవాల్సిన అవసరం ఉందన్నారు. పిడిఎఫ్ బలపరిచిన దిడ్ల వీర రాఘవులును గెలిపించి శాసన మండలికి పంపాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీల మద్దతుతో పోటీలో ఉన్న అభ్యర్థులను గెలిపిస్తే ఆయా పార్టీలకు మద్దతుగా ఉంటారే తప్ప ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక విద్యా సమస్యలపై పోరాడే ఆస్కారం ఉండదన్నారు. ఆయన వెంట రిటైర్డ్ ఉపాధ్యాయులు పి.మురళీకృష్ణ, కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు రాజు, వీరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా, అధ్యక్షుడు వై.భాస్కర్, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చాగల్లు : పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డివి.రాఘవులును గెలిపించాలంటూ ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అంగన్‌వాడీ వర్కర్స్ ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించి ఓట్లు అభ్యర్థించారు. రాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని కోరారు. పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాల్సిన ఆవశ్యకతలను ఓటర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో సుందర్‌బాబు, కె.పోశమ్మ, కెకె.దుర్గారావు, కె.బుద్ధుడు పాల్గొన్నారు

సత్వర వైద్యసేవలు అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి రాజమహేంద్రవరం రూరల్

రోగులకు అందుబాటులో ఉండి సత్వర వైద్య సేవలు అందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు. శుక్రవారం రాజమహేంద్రవరం జిజిహెచ్‌లో ఆమె తనిఖీలు నిర్వహించారు. పలు విభాగాలను పరిశీలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. జనరల్ మెడిసిన్ విభాగ ప్రధాన వైద్యులు అందుబాటులో లేకపోవడంపై అధికారులను అడిగి ఆరా తీశారు. డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేని సమయంలో ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. విధుల్లో ఉన్న వైద్యులతో మాట్లాడారు. అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. వైద్య సేవలు కోసం వచ్చిన పలువురు రోగులు , వారి సహాయకులకు ఆసుపత్రిలో పొందుతున్న వైద్య సేవలు గురించి ఆరా తీశారు.



రోగుల సహాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

నిలిచిన పిడిఎస్ బియ్యం వేలం

ప్రజాశక్తి - గోపాలపురం

వివిధ కేసుల్లో సీజ్ చేసిన పిడిఎస్ రైస్‌కు శుక్రవారం జరగాల్సిన వేలం అధికారులు సూచించిన ధరకు పాటదారులు కొనేందుకు ఆసక్తి చూపకపోవడంతో నిలిచిపోయింది. ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద డిఎస్ఒ ఎం.నాగాంజనేయులు, ఎపిజిఒ రంగప్రసాద్, సిఎస్‌డిటి పి.దివాకర్ ఆధ్వర్యంలో 47. 274 మెట్రిక్ టన్నులు పిడిఎస్ బియ్యంకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. 23 మంది వ్యాపారులు హాజరయ్యారు. ప్రభుత్వం కేజీ ధర రూ.32 నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. అధికారులు సూచించిన ధరకు కొనుగోలు చేయలేమంటూ వ్యాపారులు వేలం నుంచి వైదొలిగారు. దీంతో అధికారులు వేలాన్ని నిలిపేశారు. దీనిపై జెసికి నివేదిక ఇస్తామని వారు తెలిపారు.

19న పెన్షన్, పిఎఫ్ అదాలత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరంరూరల్

ఆంధ్రప్రదేశ్ అకౌంటెంట్ జనరల్ విభాగం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో ఉదయం 10 గంటలకు తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని పెన్షన్, జిపిఎఫ్ అదాలత్ జరుగుతుందన్నారు. జిల్లా అధికారులు, డ్రాయింగ్ అండ్ పంపిణీ అధికారులు వారి కార్యాలయాల్లో, శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పెన్షన్ కేసులు, అనుబంధ సమస్యల వివరాలతో హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ అధ్యక్షత వహిస్తారని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ట్రెజరీ అధికారి ఎన్.సత్యనారాయణ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. తగిన రికార్డులతో సంబంధిత సిబ్బంది హాజరవ్వాలని సూచించారు.

నాలుగు పోలింగ్ బూత్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి - చాగల్లు

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి మండలంలో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ ఎం.మెరికమ్మ తెలిపారు. చాగల్లు మండలంలో 2629 ఓటర్లు ఉన్నారన్నారు. చాగల్లు జిల్లా పరిషత్ హైస్కూల్లో 291 పోలింగ్ బూత్‌లో 699 మంది, 292 బూత్ఓ 698 మంది, చాగల్లు జెఆర్‌బి స్కూల్లోలో బూత్ 293లో 676 మంది, 294లో 556 ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. 1,534 మంది పురుషులు, 1,095 మంది మహిళా ఓటర్లు ఉన్నారన్నారు.



సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

చురుకుగా సమిత్వ సర్వే

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలో మోడల్ గ్రామాలుగా గుర్తించిన పోచవరం, ప్రక్కిలంక గ్రామాల్లో సమిత్వ సర్వే నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ రమణ తెలిపారు. ఈ సర్వేలో భాగంగా ప్రతి ఇంటి స్థలాలను రోవర్, సాటలైట్ ద్వారా కొలతలు చేసి ఇంటి సరిహద్దులు సేకరిస్తారని ఎంపిడిఒ తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న ఈ సర్వేను శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి అమ్మాజీ, డివిజనల్ పంచాయతీ అధికారి శాంతామణి పరిశీలించారు. వారి వెంట ఇఒపిఆర్‌డి వీరన్న ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

'తపాలా' ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ధర్నా

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పోస్టల్ ఉద్యోగ సంఘాల జాతీయ ఐక్య కార్యాచరణ సమితి ఇచ్చిన పిలుపు మేరకు తపాలా శాఖ ప్రయివేటీకరణ వ్యతిరేకంగా రాజమహేంద్రవరం తపాలా ఉద్యోగ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో స్థానిక హెడ్ పోస్టాఫీసు వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత తపాలా తపాలా ఉద్యోగుల సంఘ రాజమండ్రి డివిజన్ కార్యదర్శి బి.కొండబాబు మాట్లాడారు. తపాలా శాఖను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతుందన్నారు. ముక్కలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. దీని వల్ల చిన్న మొత్తాల పొదుపు ఖాతాల్లో ఉన్న ప్రజల పొదుపు సొమ్ముకు భద్రత లేకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. చిన్న మొత్తాల పథకాల్లో వచ్చే ఎక్కువ వడ్డీనీ, ఇన్సూరెన్స్ పాలసీలపై వచ్చే ఎక్కువ బోనస్‌ను దూరం చేయడానికి ఖాతాదారులపై వివిధ ఛార్జీలు రుద్దటానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. యూనియన్ ప్రెసిడెంట్ యు.జి.ప్రకాష్ మాట్లాడుతూ రేషనలైజేషన్ పేరుతో తపాలా కార్యాలయాలు, ఆర్ఎంఎస్ కార్యాలయాల మూసివేతకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దీని వల్ల 5 లక్షల ఉద్యోగులు రోడ్డున పడతారన్నారు. బిఎస్ఎన్ఎల్‌ను నిర్వీర్యం చేసినట్టు తపాలా శాఖను కూడా నాసనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చూస్తోందని ఎఫ్ఎన్‌పిఒ యూనియన్ కార్యదర్శి టి.రామగోపాల్ విమర్శించారు. పోస్ట్‌మెన్స్ యూనియన్ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మాట్లాడుతూ పోస్టల్ సేవలన్నీ సబ్సిడీతో కూడుకున్నాయన్నారు. పోస్ట్ కార్డు తయారీ ఖర్చు రూ.7 అయితే, ప్రజలకు 50 పైసలకు అందిస్తుందన్నారు. ఇలా పెద్ద ఎత్తున సబ్సిడీలు ఇస్తున్న పోస్టల్ శాఖను నష్టాల పేరుతో ప్రయివేటీకరించాలని చూడటం తగదన్నారు. జిడిఎస్ యూనియన్ కార్యదర్శి పి.భూలోకం మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో ప్రజలకు సేవలందిస్తున్న బ్రాంచ్ ఆఫీసులను మూసివేసి, ఉద్యోగుల సంఖ్య తగ్గించే కుట్ర జరుగుతోందని విమర్శించారు. ఏళ్లుగా ఉన్న ఉద్యోగ సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా, ప్రయివేటీకరణ పేరుతో నిర్వీర్యం చేయాలని చూడటం తగదన్నారు. ప్రజా సంస్థగా ఉన్న తపాలా శాఖను రక్షించుకోవడానికి తాము చేస్తున్న ఈ ఉద్యమానికి ప్రజలు మద్దతు తెలిపి భాగస్వామ్యులు కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం ప్రైవేటీకరణ ప్రయత్నాలు అడ్డుకోవడానికి నిరవధిక సమ్మె చేయడానికీ వెనుకాడబోమని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ శాఖల్లోని వివిధ విభాగాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



హెడ్ పోస్టాఫీస్ వద్ద నిరసన తెలుపుతున్న తపాల ఉద్యోగులు, సిబ్బంది

ఆదర్శనీయులు దామోదరం సంజీవయ్య

డిఆర్ఒ సీతారామమూర్తి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

అత్యున్నత వ్యక్తిత్వం, ఉన్నత విలువలకు మారుపేరైన దామోదరం సంజీవయ్య అందరికీ ఆదర్శనీయులని జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ పాల్గొన్నారు. దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి సంజీవయ్య అన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు దేశంలో కార్మికశాఖ, విద్యాశాఖలో పలు సంస్కరణలు చేశారన్నారు. బోనస్ చట్టాన్ని ప్రవేశపెట్టడంతో, బోనస్ సంజీవయ్యగా పేరు పొందారని చెప్పారు. నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన సంజీవయ్య తన అసమాన ప్రతిభతో ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగారని చెప్పారు. అయినప్పటికీ నీతికి, నిజాయితీకి, నిరాడంబర జీవితానికి మారుపేరుగా మారి ఆదర్శనీయులుగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌ఛార్జి డిడి ఎం.సందీప్, జిల్లా అధికారులు, డిఎస్‌డిబ్ల్యూఇఒ డి.ప్రసాద్, హాస్టల్ వార్డెన్స్, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న డిఆర్ఒ

ఉత్సాహంగా 'భాష్యం' ఆటల పోటీలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం రైల్వే క్రీడా మైదానంలో భాష్యం స్కూల్ ఈస్ట్ జోన్ ఏడు బ్రాంచీల మధ్య బాలుర ఇంటర్ జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను తూర్పుగోదావరి విద్యాశాఖాధికారి డిఇఒ వాసుదేవరావు, రాజమండ్రి సెంట్రల్ జోన్ డిఎస్‌పి రమేష్ బాబు, భాష్యం జోనల్ ఇన్‌ఛార్జి వి.ఆంజనేయులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు కూడా చాలా ముఖ్యమైనవన్నారు. వాటి ద్వారా ఏకాగ్రత పెరుగుతుందన్నారు. డిఎస్‌పి రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులకి ఆటల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. భాష్యం జోనల్ ఇన్‌ఛార్జి ఆంజనేయులు మాట్లాడుతూ, చదువుతో పాటుగా క్రీడలకు కూడా తాము సమ ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాష్యం స్కూల్స్ ప్రిన్సిపల్స్ పి.హరిబాబు, కెవివి.సత్యనారాయణ, పి.దుర్గాప్రసాద్, పార్వతిరెడ్డి, వై.రాహుల్, జె.సూర్యనారాయణ, పి.పేరయ్యనాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువు సుందరీకరణకు శ్రీకారం

ప్రజాశక్తి - కడియం


కడియపులంక గ్రామంలో ఎన్నో ఏళ్లుగా దుర్గంధం వెదజల్లుతూ గ్రామ ప్రజలకు సమస్యగా మారిన పాత పూల మార్కెట్ సమీపంలో గల పర్యాటక శాఖకు చెందిన చెరువుకు మహర్దశ పట్టనుంది. సర్పంచ్ పాఠంశెట్టి రాంజీ పర్యవేక్షణలో కొన్ని రోజులుగా విద్యుత్ మోటార్ల సహాయంతో చెరువులో మురుగు నీటిని బయటకు తొలగిస్తున్నారు. నీటిని పూర్తిగా తొలగించిన తర్వాత పూడికతీత పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి సహకారంతో చెరువును అభివృద్ధి చేసి వాకింగ్‌కు సౌకర్యంగా తీర్చిదిద్దేందుకు, వద్దులు కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేస్తామని రాంజీ తెలిపారు. అలాగే గ్రామ పెద్దల సహకారంతో పచ్చటి మొక్కలతో గ్రీనరీని తీర్చి దిద్దేలా ఏర్పాట్లు చేస్తామన్నారు.

కూటమి అభ్యర్థిని డిస్‌క్వాలిఫై చేయాలి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ని ఈసి డిస్‌క్వాలిఫై చేయాలని స్వతంత్ర అభ్యర్థి జివి.సుందర్ డిమాండ్ చేశారు. స్థానిక రాజీవ్ గాంధీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లకు కూటమి అభ్యర్థి ట్రాన్స్‌పోర్టు కోసం టికెట్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీనిపై తాను సిఇఒకు మెయిల్ చేశానన్నారు.రిటర్నింగ్ ఆఫీసర్ స్పందించి వెంటనే పేరాబత్తుల రాజశేఖర్‌ని డిస్‌క్వాలిఫై చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఎంఎల్‌సి అభ్యర్థి జాబితా విషయంలో నంబర్ కేటాయించడంలో పలు సందేహాలున్నాయన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా ఓటర్లను ఎలా మభ్యపెడుతున్నారో సుందర్ లైవ్‌లో వివరించారు.

కార్టూ'నిజం'



పెరుగుతున్న వృద్ధులు

కడియంలో పేట్రేగిపోతున్న పుష్పరాజ్‌లు

ప్రజాశక్తి - కడియం

కడియం మండలంలో 'పుష్ప రాజ్'లు పెట్రేగిపోతున్నారు. పలు గ్రామాల్లోని చెట్లను నరికేస్తూ సొమ్ములు చేసుకుంటున్నారు. ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్, డ్రెయినేజీ బోర్డు స్థలాల్లో ఉన్న చెట్లను అక్రమంగా నరికి తరలించేస్తున్నారు. ముఖ్యంగా కెనాల్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను, కాలువ గట్లు, పుంత రోడ్లు, మురుగు కాలువ గట్ల వెంబడి ఉన్న చెట్లను ఇష్టానుసారంగా నరికేస్తూ కలపను వాహనాలు ద్వారా తరలించేస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా చెట్ల మీద పడి బతికేస్తున్నారు. సొంత వాహనాలు, సొంత కూలీలు, ఛార్జింగ్ కటింగ్ మిషన్లతో మండలమంతా కలియ తిరుగుతూ ప్రభుత్వ భూముల్లో కనిపించే చెట్లను మాయం చేసేస్తున్నారు. అక్రమ కలప మాఫియా చెట్లు నరికివేత, తరలింపు సమయాల్లో అవసరం మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారపార్టీల నాయకుల పేర్లను కూడా వాడేస్తున్నారు.

కొందరు నర్సరీల సాగు పేరుతో రోడ్లు, కాలువ గట్లు వెంబడి ఉన్న దశాబ్దాల కాలంనాటి వృక్షాలను సైతం మింగేస్తున్నారు. తమ నర్సరీల చెంతన ఉన్న రోడ్ మార్జిన్ల మట్టిని తవ్వేస్తూ, అడ్డొచ్చిన చెట్లని తొలగించేస్తున్నారు. అలాగే విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ సరఫరాలో భాగంగా అడ్డు వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించిన చోటే వదిలేస్తున్నారు. దీంతో ఆ కొమ్మల మాటున చెట్లను కూడా పూర్తిగా తొలగించేస్తున్నారు ఈ కలప స్మగ్లర్లు. కొన్ని కొన్ని సందర్భాల్లో చెట్లు నరికేసి, ముక్కలు, ముక్కలుగా కట్ చేసి అదే ప్రదేశంలో నాలు, గైదు రోజులు వదిలేస్తున్నారు. తర్వాత వాహనాల్లో వచ్చి దర్జాగా పట్టుకెళ్ళిపోతున్నారు. పెద్ద పెద్ద చెట్లను సమీప ప్రాంతాల్లోని సామిల్లులకు అమ్మేస్తున్నారు. ముఖ్యంగా దహన సంస్కారాలకు కలప అమ్మే కొందరు ఈ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. కిరాయి కూలీలను పురమాయించుకుని, సొంత వాహనాల ద్వారా పని కానిచ్చేస్తున్నారు. ఇంత జరుగుతున్న సంబంధిత శాఖల సిబ్బంది గాని, స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు గాని స్పందించిన దాఖలాలు లేవు.

సామిల్లులు, టింబర్ డిపోలు, కలప అమ్మకం దారులు ఉంచిన నిల్వల పై తనిఖీలు చేపట్టాల్సిన ఫారెస్ట్ అధికారులు, చెట్లను రక్షించాల్సిన రెవెన్యూ అధికారులు సక్రమంగా విధులు నిర్వహించకపోవడం వల్లే అక్రమార్కులు పెట్రేగిపోతున్నారని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. "మొక్కలు నాటండి...పర్యావరణాన్ని కాపాడండి "చెట్లను పెంచండి.. ప్రకృతిని కాపాడండి" అని పదే పదే ప్రభుత్వాలు, ఉన్నతాదికారులు ఆదేశిస్తున్నారు. ఈ మేరకు మొక్కలను నాటడం వరకు శ్రద్ధ చూపుతున్న అధికారులు, వాటిని పెంచడంలో అలసత్వం వహిస్తున్నారు. చెట్లను పెంచడం మాట అటు ఉంచితే ఉన్న చెట్లను కాపాడడంలో పూర్తిగా విఫలం అవుతున్నారని చెప్పవచ్చు. మరి మొక్కలు నాటి పెంచడం, చెట్లను కాపాడడంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకుంటారో, లేక కలప స్మగ్లర్లు, మాఫియాదారుల కొమ్ము కాస్తారో వేచి చూడాలి !!

దీనిపై సంబందిత శాఖల అధికారులను వివరణ కోరగా చెట్లు నరికివేత, తరలింపు విషయాలు ఇప్పటివరకూ తమ దృష్టికి రాలేదని, తమ సిబ్బందిని ఆయా ప్రదేశాలకు పరిశీలన నిమిత్తం పంపిస్తామన్నారు. తాము కూడా దృష్టి కేంద్రికరిస్తామని, అక్రమంగా చెట్లు నరికేస్తున్న వారిని గుర్తించేందుకు ప్రత్నాలు చేస్తామన్నారు. అలాగే ఇక మీదట అందరి సహకారంతో నిఘా ఉంచుతామన్నారు.



కాలువ చెంతన నరికేసిన భారీ వృక్షం



రోడ్డు చెంతన వృక్షం ఇలా...



వాహనంలో తరలించేస్తున్న కలప

నేరాలు ఘోరాలు

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలో రమణక్కపేట రహదారిలో అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు ముందస్తుగా వచ్చిన సమాచారంతో రమణక్కపేట రహదారిలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో వాహనంలో తరలిస్తున్న 4 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.వెంకటేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణ శివారు చెందుర్తి జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని చేబ్రోలు గ్రామానికి చెందిన గొర్ల గంగాధర్‌రావు తన పొలం పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై చెందుర్తి వెళుతుండగా 214 జాతీయ రహదారిపై వేగంగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గంగాధర్‌రావు ఎగిరి కారు వెనకవైపు డిక్కీ మీద పడి తీవ్ర గాయాలు పాలయ్యాడు. సమాచారం తెలుసుకున్న బంధువులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అతనిని మేడికవర్ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సారా బట్టీపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

నాటు సారా బట్టీపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. మండలంలోని కోనపాపపేట శివారు జీడి తోటలో పిల్లి భూషణం అనే వ్యక్తి నాటు సారా బట్టీని నిర్వహిస్తుండటంతో పోలీసులు దాడి చేశారు. 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. నిందుతుడిపై కేసు నమోదు కోర్టులో హాజరుపర్చినట్లు ఆయన తెలిపారు.

గుళికలు చల్లుతూ కౌలు రైతు మృతి

ప్రజాశక్తి - కె.గంగవరం

మండలంలోని పానింగపల్లి గ్రామంలో మోర్త నాని(28) అనే యువకుడు గుళికలు చల్లుతూ మృతి చెందాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాణింగపల్లి గ్రామానికి మోర్త నాని తన తండ్రి ఆనందరావుతో కలిసి 4 ఎకరాలు పంట భూమిని కౌలుకు తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం గుళికలు మందులు చల్లేందుకు పోలానికి వెళ్లాడు. మధ్యాహ్నం పురుగుల మందు వాసనకు తీవ్ర అస్వస్థతకు గురై పడిపోయాడు. వెంటనే అతనిని పామర్రు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. కౌలు రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ సర్పంచ్, గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

దాడిపై కేసు నమోదు

ప్రజాశక్తి - కరప

మండలంలోని యండమూరు గ్రామంలో కోడి కత్తితో ఒక వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.సునీత తెలిపారు. ఈ నెల 8వ తేదీన యండమూరు గ్రామంలో వెంకటేశ్వర స్వామి కళ్యాణం రథం ఊరేగింపు నిర్వహించారు. కాపుల రామాలయం వద్దకు రథం వచ్చే సమయంలో ఈశ్వర ప్రసాద్ అనే వ్యక్తి బాణా సంచా జువ్వలు వేశాడు. అక్కడే ఉన్న మారెళ్ళ అజయ్, మరికొంతమంది నువ్వు కావాలనే మా మీదకు జువ్వలు వేస్తున్నావు అని గొడవకు దిగారు. గ్రామస్తులు అందరూ వాళ్ళకి సర్ది చెప్పి అక్కడ నుండి వారిని పంపించేశారు. ఈ నేపథ్యంలో 13వ తేదీన సాయంత్రం 6.40 గంటలకు వెంకటేశ్వర స్వామి గుడి దగ్గరకు రమ్మని మారెళ్ళ అజయ్ జువ్వలు వేసిన ఈశ్వర్ ప్రసాద్‌ను పిలిచారు. తన ఇద్దరు స్నేహితులతో కలిసి ఈశ్వర్ ప్రసాద్ గుడి దగ్గరకు వచ్చారు. తన స్నేహితులతో కలిసి కోడి కత్తితో ఈశ్వర్ ప్రసాద్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో ఈశ్వరప్రసాద్ గాయాలపాలయ్యాడు. దీంతో అతని స్నేహితులు ఈశ్వర ప్రసాద్‌ను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సామర్లకోట

గ్రామంలోకి ఎవరైనా అపరిచిత వ్యక్తులు వస్తే అప్రమత్తంగా ఉండాలని సిఐ కృష్ణభగవాన్ సూచించారు. ఇటీవల తమ కాలనీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నట్లు కాలనీ వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం పిఠాపురం రోడ్‌లో ఉన్న టిడ్కో కాలనీ ప్రాంతాన్ని సిఐ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీ వాసులతో మాట్లాడుతూ ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులు కనిపిస్తే పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. అలాగే గృహాలలో ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు అద్దె కొరకు వచ్చిన వారి గురించి సమాచారం ఇవ్వాలన్నారు. పట్టణానికి దూరంగా ఉన్న గృహాల వద్ద నివసిస్తున్న ప్రజలు భయపడకుండా ధైర్యంగా ఉండి తమ సహాయం పొందాలని తెలిపారు.

వికలాంగుల గుర్తింపు కోసం ఇంటింటా సర్వే

ప్రజాశక్తి - పిఠాపురం

నియోజవర్గంలో వికలాంగుల గుర్తింపు కోసం ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ప్యానల్ లాయర్లు, పారా లిగల్ వాలంటీర్లు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు రోజువారిగా ఈ సర్వే నిర్వహిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగులకు ఏ విధమైన గుర్తింపు ఇస్తున్నాయి, ఏ విధమైన సౌకర్యాలు కల్పిస్తుంది? వారికి ఏ విధమైన సౌకర్యాలు కావాలి అనే అంశాలపై సర్వే చేస్తున్నారు. ఇప్పటివరకు గొల్లప్రోలు మండలంలో కొడవలి, తాటిపర్తి, పిఠాపురం మండలంలో కోలంక గోకివాడ, ఎల్ఎన్.పురం, జగపతిరాజపురం, మాధవపురం, కొత్తపల్లి మండలంలో నాగులపల్లి, ఉప్పాడ తదితర గ్రామాల్లో ఈ సర్వే పూర్తి చేశారు.

పోలింగ్ విధులపై అవగాహన తప్పనిసరి

జిల్లా సహాయ ఎన్నికల అధికారి సీతారామమూర్తి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలకు సంబంధించి ఈ నెల 27న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తూర్పుగోదావరి జిల్లా సహాయ ఎన్నికల అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామమూర్తి ఎన్నికల సిబ్బందికి సూచించారు. ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై శుక్రవారం స్థానిక ఎస్‌కెవిటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన తొలి విడత శిక్షణ కార్యక్రమానికి డిఆర్‌ఒ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో మొత్తం 102 మంది పిఒలు, 102 మంది ఎపిఒలను నియమించామన్నారు. ఎలాంటి సందేహాలున్నా, శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. శిక్షణ తరగతులను చక్కగా ఆకళింపు చేసుకుని ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. ఇదివరకు నిర్వహించిన ఎన్నికల విధులే కదా అని శిక్షణా తరగతులను తేలికగా తీసుకోకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు సంబంధించిన ప్రతి ఒక్క అంశాన్ని తెలుసుకోవాలని సూచించారు. ప్రధానంగా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే, శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొంత భిన్నంగా ఉంటుందన్నారు. బ్యాలెట్ పద్ధతిన జరిగే పోలింగ్ ప్రక్రియలో ఓటింగ్ నిర్వహణకు కొంచెం ఎక్కువ వ్యవధి పట్టే అవకాశాలు ఉన్నందున ఓపిగ్గా, సంయమనంతో వ్యవరిస్తూ సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఈ నెల 27వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. గడువు లోపు పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూ లైన్‌లో ఉన్న వారికి వరుస క్రమంలో టోకెన్ నెంబర్లు అందించి వారితో ఓటింగ్ జరిపించాలన్నారు. పోలింగ్‌కు ఒక రోజు ముందుగానే ఈ నెల 26 ఉదయం 8 గంటలకు ప్రిసైడింగ్ అధికారులు తమ బృందంతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. పంపిణీ కేంద్రాల వద్ద అందించే పోలింగ్ సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, చెక్ లిస్ట్‌లో పొందుపర్చబడిన దానికి అనుగుణంగా మెటీరియల్‌ను సరిచూసుకోవాలన్నారు. అనంతరం అధికార యంత్రాంగం సమకూర్చిన వాహనంలోనే నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ చిన్న తప్పిదానికి కూడా తావు లేకుండా పూర్తి పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ జరిగేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. నిర్లక్ష్య వైఖరి కారణంగా , తప్పిదాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పోలింగ్ కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ముందస్తుగానే పోలింగ్ విధుల గురించి పరిపూర్ణమైన అవగాహన కల్పించాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ రోజు బ్యాలెట్ బాక్సులు తీసుకొని, పోలింగ్ ప్రక్రియ ముగిసిన మీదట వాటిని నిర్దేశించిన రిసెప్షన్ సెంటర్‌లో అప్పగించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదేనని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమావళి ప్రకారంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా విధులు నిర్వహించాలన్నారు. ఓటర్లు, అభ్యర్థుల ఏజెంట్లు వివిధ అంశాలపై సందేహాలను లేవనెత్తే అవకాశాలు ఉన్నందున వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత పిఒలదేనన్నారు. పోలింగ్ పూర్తయిన అనంతరం పక్కాగా రికార్డు బుక్కులలో వివరాలను పొందుపరుస్తూ నివేదిక తయారు చేయాలని సూచించారు. ఈ శిక్షణ తరగతుల్లో కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్ రెడ్డి, మాస్టర్ ట్రైనర్స్, పిఒలు, ఎపిఒలు పాల్గొన్నారు.



సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పట్టణ ప్రణాళికా విభాగపు సిబ్బంది నిబద్ధతతో పనిచేసి నగరపాలక సంస్థ ప్రతిష్ఠను ఇనుమడింపజేయాలని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. శుక్రవారం పట్టణ ప్రణాళికా విభాగాన్ని ఆయన తనిఖీ చేశారు. పట్టణ ప్రణాళికా కార్యకలాపాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపిఎంఎస్ ద్వారా వచ్చే ప్రతి భవన నిర్మాణ దరఖాస్తును పెండింగులో ఉంచకుండా నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. బిపిఎస్ దరఖాస్తులు పరిశీలించి, పరిష్కరించడానికి అవసరమైన అన్ని పత్రాలు జతచేసి దాఖలు చేయాలన్నారు. లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్(ఎల్‌టిపి)కి ఫోన్ చేసి దరఖాస్తుతో పాటు జతచేస్తున్న పత్రాలు గురించి ఆరా తీశారు. రాబోయే పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని నగరములో చేపట్టాల్సిన రోడ్ల విస్తరణ కార్యక్రమాలను సమీక్షించారు. విస్తరణ చేయాల్సిన రోడ్డులో ఉన్న భవన యజమానుల నుంచి పత్రాలను వెంటనే సేకరించాలన్నారు. కొత్తగా చేపట్టబోయే రోడ్ల విస్తరణకు సంబంధించి ప్రణాళిక సిద్ధం చేసి రోడ్డులోని భవన యజమానులతో సంప్రదింపులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలో చేపట్టిన ఆక్రమణలు తొలగింపు కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. క్రమణలు తొలగించినప్పటికీ తిరిగి ఆక్రమణకు సిద్ధపడుతున్నవారిపై జరిమానాలు విధించాలన్నారు. అలాంటి వారి సామగ్రిని స్వాధీనం చేసుకొని కార్యాలయానికి తరలించాలన్నారు. కమిషనర్ అనుమతి లేనిదే ఆక్రమణదారుల సామగ్రిని అప్పగించరాదని ఆదేశించారు. నగరంలో అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో గతంలో ఉన్న కన్వర్వెన్సీ సందులను సంబంధిత భవన యజమానులు కొనుగోలు చేసేందుకు వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలన్నారు. దరఖాస్తు చేయని వారికి అవగాహన కల్పించి వారితో కూడా కన్వర్వెన్సీ ల్యాండ్ కొనుగోలుకు దరఖాస్తు పెట్టించాలన్నారు. టిడిఆర్ కోసం వచ్చిన దరఖాస్తులను పరిష్కరించే ముందు స్థలం యజమాని అంగీకార పత్రాన్ని తీసుకోవాలన్నారు. వారు దఖలు చేసిన స్థలము యొక్క దస్తావేజులు, సంబంధిత ఇతర పత్రాలు సక్రమంగా సమర్పించేలా చూడాలన్నారు. పూర్తి స్థాయిలో పత్రాలన్ని దాఖలు చేసిన పిదప సమగ్ర పరిశీలన చేసి టి.డి.ఆర్. పత్రాలు విడుదల కోసం దస్త్రాలు ఎగ్జిక్యూటివ్ అథారిటీకి సమర్పించాలని ఆదేశించారు. నగరంలో జంక్షన్ల అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికా సిద్ధం చేయాలన్నారు. కోటిపల్లి బస్టాండు వద్ద అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన కంటైనర్‌ను తొలగించాలని ఆదేశించారు. అనుమతి లేకుండా ఎవరూ బ్యానర్స్ ఏర్పాటు చేయరాదని, ఎవరైన అనుమతి లేకుండా బ్యానర్లు, హోర్డింగ్‌లు పెడితే వెంటనే తొలగించాలన్నారు. వారికి పెద్ద మొత్తములో జరిమానాలు విధించాలని ఆదేశించారు. భవన నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారి నుంచి నిర్ణయించిన రుసుము వసూలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భములో ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రణాళికా శాఖ సిబ్బంది డైరీని కమిషనరు కేతన్ గార్గ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానరు కోటయ్య, డిప్యూటి సిటీ ప్లానరు సత్యనారాయణరాజు, అసిస్టెంట్ సిటీ ప్లానరు అనితా జూలీ, శ్రీనివాసరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

2వ రోజుకు అంగన్‌వాడీల శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో అంగన్‌వాడీలకు చేపట్టిన శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. శుక్రవారం వరుసగా రెండో రోజు శిక్షణ కార్యక్రమాలు జరిగాయి.

రాజమహేంద్రవరం : లాలాచెరువు, ఆనంద్ నగర్ హైస్కూల్‌లో సిడిపిఒ సిహెచ్.నరసమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు కొన సాగుతున్నాయి. చిన్నారుల పోషకాహారంపై దష్టి సారించడం, ప్రీస్కూల్ విద్యా నాణ్యతను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణా తరగతులను సూపర్‌వైజర్లు బి.వరలక్ష్మి, జి.అచ్చియ్యమ్మ, ఎన్.నాగవేణి నిర్వహించారు.

ఉండ్రాజవరం : మండలంలోని సెక్టార్ 1, సెక్టార్ 2 అంగనవాడి కార్యకర్తలకు పోషణ్ భీ, పఢాయి భీ శిక్షణా తరగతులు రెండవ రోజు శుక్రవారం మండలంలోని వేలివెన్ను, ఉండ్రాజవరంలో నిర్వహించారు. పోషణాభివృద్ధి కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణా తరగతుల్లో భాగంగా నవచేతన పోషక లోపం ఉన్న సామ్, మామ్ పిల్లలను గుర్తించి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, విద్యా విధానంపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు భాగ్యలక్ష్మి, ఎం.బాలసరస్వతి, హెచ్ఎం మాణిక్యాల రావు, వీరాంజనేయులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

చాగల్లు : చాగల్లు జిల్లా పరిషత్ హై స్కూల్లో చాగల్లు, మార్కొండపాడు సెక్టార్‌లోని అంగన్‌వాడీలకు శిక్షణ రెండవ రోజు కొనసాగింది. ఐసిడిఎస్ సూపరింటెండెంట్లు శిరీష, పద్మావతి పాల్గొని శిక్షణ ఇచ్చారు. నవ చేతన పిల్లలకు వయస్సు ఆధారంగా యాక్టివిటీస్ ఎలా నిర్వహించాలో తెలిపారు.

నిడదవోలు : పట్టణంలోని నెంబర్-3 మున్సిపల్ హై స్కూల్ పాఠశాలలో అంగన్‌వాడీలకు శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సిహెచ్.లక్ష్మి పాల్గొని పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు, తాడిమళ్ళ సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీలు పాల్గొన్నారు.


శిక్షణా తరగతులకు హాజరైన అంగన్‌వాడీలు

పెరవలి : పెరవలి జిల్లా పరిషత్ హైస్కూల్లో సిడిపిఒ ఎం.శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో 67 మంది అంగన్‌వాడీలకు శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ వి.సరోజిని, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పుల్వామా అమరవీరులకు ఘన నివాళి

ప్రజాశక్తి - కాకినాడ, పెద్దాపురం

ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో పుల్వామా అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు పాల్గొని అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బ్లాక్ డే చిత్రాన్ని గీసిన విద్యార్థులకు ప్రోగ్రాం ఆఫీసర్ టి.తేజేశ్వరరావు జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒలు టి తేజేశ్వరరావు, ఐ.గౌరీప్రియ, అధ్యాపకులు పృథ్వీకృష్ణ, ఎల్ఎస్.వెంకటేష్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం మండలం దివిలి గ్రామంలో ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆమె పుల్వామా అమరవీరుల త్యాగాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో దివిలి కిట్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు. అలాగే టిడిపి మండల అధ్యక్షులు కొత్తిం వెంకట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దివిలి గ్రామంలో పుల్వామా అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో తిరుపతి సర్పంచ్ మోయిళ్ళ కృష్ణమూర్తి, పులిమేరు సర్పంచ్ తుమ్మల నాని, రేలంగి బుజ్జి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న ఆదిత్య విద్యార్థులు

యానాంలో కాంగ్రెస్ నాయకుల పర్యటన

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ఎంపి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైద్యలింగం, మాజీ ముఖ్యమంత్రి వి.నారాయణస్వామి, పుదుచ్చేరి సిఎల్‌పి నాయకుడు వైద్యనాథన్, పలువురు ఎంఎల్‌ఎలు శుక్రవారం యానాంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక కనకాలపేటలోని డంపింగ్ యార్డును వారు పరిశీలించారు. డంపింగ్ యార్డును తక్షణమే తరలించాలని కోరుతూ స్థానికులు ఎంపికి వినతిపత్రం అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా డంపింగ్ యార్డును తరలించాలని కోరుతున్నా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దొమ్మేటి పేటలో మురికి కాలువను పరిశీలించారు. స్థానిక ఎలక్ట్రిసిటీ కార్యాలయం వద్ద విద్యుత్ ఛార్జీల పెంపుదలను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. రంగస్వామి ప్రభుత్వం ఛార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తుందని తక్షణమే తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. స్థానిక దవులూరి కాంప్లెక్స్ వద్ద జరిగిన బహిరంగ సభలో పలువురు స్థానిక నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రముఖ వ్యాపారవేత్త కాటంశెట్టి రామమూర్తి పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి నాయకులు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పొనుగుమట్ల విష్ణుమూర్తి, సబ్బతి శ్రీనివాసరావు, దుగ్గుదుర్తి అనిత తదితరులు పలు సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధాని దినేష్, విళ్ల చిన్ని, ప్రసాద్‌రాజు, చీకట్ల రామకృష్ణ, దవులూరి పతి, తదితరులు పాల్గొన్నారు.


కండువా వేసి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ నేతలు

వైసిపిని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తాం

ప్రజాశక్తి - పిఠాపురం

వైసిపిని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తామని జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అన్నారు. శుక్రవారం ఆయన పిఠాపురం వైసిపి కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వంగా గీత ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై నమ్మకంతో కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా నియమించిన మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని నాయకులు, కార్యకర్తల అందరి సహాయ సహకారాలు, సలహాలు, సూచనలు తీసుకుని వైసిపిని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తామన్నారు. నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన నడుస్తుందని, మాజీ ఎంఎల్‌ఎ వల్లభనేని వంశీ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసు వ్యవస్థను ఉపయోగించుకుని కూటమి ప్రభుత్వం దాడులు, దౌర్జన్యాలకు పాల్పడు తుందని విమర్శించారు. న్యాయవస్థలపై తమకు పూర్తి నమ్మకం ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్య క్రమంలో పెద్దాపురం నియోజవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరు దొరబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న దాడిశెట్టి రాజా

పశువుల ఆసుపత్రిలో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - యానాం

నేతాజీ సుభాష్ చంద్రబోస్ గవర్నమెంట్ ఐటిఐ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు శుక్రవారం స్థానిక పశువుల ఆసుపత్రి ఆవరణలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొని వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుధాకర్, లంక ప్రసాదరావు పాల్గొన్నారు.

పలువురికి పెళ్లి కానుకల అందజేత

ప్రజాశక్తి - జగ్గంపేట

నియోజకవర్గంలో శుక్రవారం వివాహం చేసుకున్న పలువురికి టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పెళ్లికానుకలను అందజేశారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ తరుపున నియోజకవర్గంలో వివాహం చేసుకుంటున్న పెళ్లి కుమార్తెకు రూ.20 వేలు అందజేయడం విధితమే. ఈ నేపథ్యంలోనే శుక్రవారం గండేపల్లి మండలంలో నలుగురికి, జగ్గంపేట మండలంలో ఇద్దరికీ, కిర్లంపూడి మండలంలో ముగ్గురికి, గోకవరం మండలంలో ముగ్గురికి ఒక్కొక్కరికీ రూ.20 వేలు చొప్పున రూ.2.40 లక్షలను ఆయన అందజేశారు. ఒకేరోజు 14 మంది పెళ్లికుమార్తెలకు అందజేయడం రికార్డుగా నిలిచింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఆడబిడ్డ పెళ్లి చేసుకుంటే తొమ్మిది రోజుల ముందు స్థానిక జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బద్ది సురేష్, చదరం చంటిబాబు, బుర్రి సత్తిబాబు, అనుకూల శ్రీకాంత్, ముర్రి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



పెళ్లి కుమార్తెకు చెక్కును అందిస్తున్న జ్యోతుల నవీన్

ఉత్సాహంగా లేగ దూడల పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని జి.రాగంపేటలో లేగ దూడలకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆ గ్రామ రైతులే కాకుండా పరిసర గ్రామాల రైతులు తిలకించారు. పోటీలు అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు లేగ దూడలను ఎంపిక చేశారు. నాలం వీరభద్రరావు (ప్రథమ), బాసర కృష్ణ (ద్వితీయ), మలిరెడ్డి దుర్గ (తతీయ)లకు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతగా కిర్లం పూడి పశు వైద్యాధికారి డాక్టర్ వెన్నా వినోద్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అంబేద్కర్, అసిస్టెంట్ డైరెక్టర్ తుమ్మల రామస్వామి, డాక్టర్ మస్తాన్‌బీ, బి.ప్రసాద్, కె.కోటి, పుష్పరాజు, పి.ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.


విజేతకు బహుమతిని అందిస్తున్న నిర్వాహకులు